కొండెంపూడిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల?

- ప్రభుత్వానికి చోడవరం ఎమ్మెల్యే రాజు ప్రతిపాదనలు

చోడవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. చోడవరం మండలం గంధవరంలో విత్తన గిడ్డంగి, ఉత్పత్తి క్షేత్రం పనులు దాదాపు పూర్తికావచ్చాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. చోడవరం పట్టణంలో రైతు బజార్ మరో నెల రోజుల్లో ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు.

రైతు బజార్‌కు కదలిక

ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటుకు అధికారులు నిర్ణయం

- రూ.14.5 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు
- ఏడేళ్లకు తీరనున్న పట్టణవాసుల కల


కరోనా సమయంలో కూరగాయలు విక్రయించిన ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఒక బ్లాక్

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతు బజార్ ఏర్పాటులో కదలిక వచ్చింది. పట్టణంలోని పలు ప్రదేశాలను ప్రదేశాలను పరిశీలించిన మార్కెటింగ్ శాఖ అధికారులు.. ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు 2018లో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తీవ్ర ప్రయత్నాలు చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు గాంధీ మార్కెట్‌లో నడుస్తున్న కూరగాయల మార్కెట్‌ను, దానికి ఎదురుగా ఉన్న డీసీఎంఎస్ ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. రైతు బజార్ ఏర్పాటు ఒక కొలిక్కి వస్తున్న సమయంలో (2019) ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత వైసీపీ పాలకులు స్పందించి రైతు బజార్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. పలుచోట్ల స్థలాలను పరిశీలించిన అధికారులు.. తుది ఎంపిక చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నియోజక వర్గంలో ఒక రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటుపై ప్రజల్లో మరోసారి ఆశలు చిగురించాయి.

ఐదేళ్ల క్రితం కొవిడ్-19 ప్రబలిన సమయంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయం మార్గంలోగల బ్లాకుల్లో కూరగాయల మార్కెట్ నిర్వహించారు. దీనిని రైతు బజార్‌గా మార్చాలని అప్పట్లోనే పలువురు డిమాండ్ చేశారు. కానీ కరోనా ప్రభావం తగ్గిన తరువాత ఇక్కడ కూరగాయల మార్కెట్‌ను ఎత్తివేశారు. ఇప్పుడు రైతుబజార్‌ను ఇక్కడే ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన పనులను మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తారని సమాచారం. రైతు బజార్ అందుబాటులోకి వస్తే అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం మండలాల్లో కూరగాయలు పండించే రైతులు గిట్టుబాటు ధరలకు తమ ఉత్పత్తులను అమ్ముకుంటారు. ఇదే సమయంలో వినియోగదారులకు తక్కువ రేటుకు కూరగాయలు లభిస్తాయి. కాగా రైతు బజార్ ఏర్పాటుపై జిల్లా మార్కెటింగ్ అధికారి రవికుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రైతు బజార్ ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పనకు రూ.14.5 లక్షలు మంజూరు చేయాలని తమ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.


మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న బ్లాక్


చిన్నారుల మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

వరహా నదిలో మునిగి అన్నదమ్ముల మృతి

ఇద్దరి ప్రాణాలు తీసిన ఇసుక గోతులు

- పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో నదిలో ఈతకు వెళ్లి మృత్యువాత
- జానకిరాంపురంలో విషాదఛాయలు


సుర్ల దేవా (ఫైల్ ఫొటో)


సుర్ల హేమంత్ (ఫైల్ ఫొటో)

కోటవురట్ల జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
ఇసుక తవ్వకాల కోసం వరహా నదిలో తీసిన గోతులు అన్నదమ్ములైన ఇద్దరు చిన్నారుల ప్రాణాలు తీశాయి. ఇటీవల పాఠశాలకు సెలవులు కావడంతో నదిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లి, నీట మునిగి మృతిచెందారు. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబీకులు, ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

కోటవురట్ల పంచాయతీ శివారు జానకిరామపురం గ్రామానికి చెందిన సుర్ల రాము, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు దేవా(15), చిన్న హేమంత్(13), అదే గ్రామానికి చెందిన అల్లు నాయుడు, కె.వెంకటాపురం గ్రామానికి చెందిన పొలుపర్తి మోహన్ కలిసి బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో గ్రామానికి సమీపంలో వున్న వరహా నదిలో ఈతకొట్టడానికి వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలతో నదిలో నీట ప్రవాహం పెరిగింది. అంతకుముందు ఇసుక తవ్వకాల కారణంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదిలో నీటి ప్రవాహం కారణంగా ఎక్కడ గోతులు వున్నాయో చిన్నారులు అంచనా వేయలేకపోయారు. నదిలో దిగి ఈత కొట్టడానికి ముందుకు వెళుతూ.. దేవా, హేమంత్ ఇసుక కోసం తవ్విన గోతుల్లో పడి నీటిలో మునిగిపోయారు. నాయుడు, మోహన్ ... మిగతా 8వ పేజీలో

ఉపాధి కూలీలకు తీపి కబురు

వేతన బకాయిలు రూ.135 కోట్లు విడుదల

- మార్చి నుంచి ఏప్రిల్ మూడో వారం వరకు చెల్లింపులు
- ఒకటి, రెండు రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ


చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
ఉపాధి కూలీల వేతన బకాయిల చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు విడుదల చేసింది. అనకాపల్లి జిల్లాకు రూ.135 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 2.82 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు వున్నాయి. డ్వామా అధికారులు ఈ ఏడాది జనవరిలో కూలీలకు పనులు కల్పించడం ప్రారంభించారు. మార్చి నుంచి చెరువులు, పంట కాలువల్లో పూడిక తీత పనులు ఊపందుకున్నాయి. కేంద్రం నుంచి నిధులు విడుదలలో జాప్యం కారణంగా ఏప్రిల్ వరకు కూలీలకు వేతనాలు అందలేదు. గత నెలలో నిధులు విడుదల అయినప్పటికీ ఫిబ్రవరి వరకు చేసిన పనులకు సంబంధించి వేతనాలు అందాయి. వాస్తవంగా జనవరిలో సంక్రాంతి పండుగ వుండడం, పలువురు కూలీలు గోదావరి జిల్లాల్లో రబీ వరినాట్లుకు వెళ్లడం, స్థానికంగా రబీకి సంబంధించి వ్యవసాయ పనులు వుండడం వంటి కారణాల వల్ల జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఉపాధి పనులకు చాలా తక్కువ మంది హాజరయ్యారు. మార్చి నుంచి పూర్తిస్థాయిలో పనులకు వస్తున్నారు. అయితే మార్చి నుంచి వేతనాలు అందకపోవడంతో వామపక్షాల ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో వివిధ రూపాల్లో నిరసన తెలియజేశారు. గత మూడు, నాలుగు నెలల నుంచి ఉపాధి పనులు తప్ప వేరే పనులు లేకపోవడం, వేతనాల చెల్లింపుల్లో తీవ్రజాప్యం కారణంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే కూలీల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని అధికారులు చెబుతూ వస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఉపాధి నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాసొమ్ము కూడా కలిపి అనకాపల్లి జిల్లాకు రూ.135 కోట్లు విడుదల చేసింది. మార్చి నుంచి ఏప్రిల్ మూడో వారం నాటికి ఉపాధి కూలీల బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు ఒకటి, రెండు రోజుల్లో వేతనాల డబ్బులు జమ అవుతా యని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి తెలిపారు. ఉపాధి హామీ కన్వర్జెన్సీ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, భవన నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లరకు రూ.110 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో వున్నట్టు ఆమె చెప్పారు.

కూటమి ఏడాది సంబరం


పాయకరావుపేటలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఏడాది పాలనను కూటమి నాయకులు బుధవారం ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉమ్మడిగా కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంచారు. పలుచోట్ల బాణసంచా కాల్చారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జరిగిన కార్యక్రమంలో జనసేన చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్‌రాజుతో కలిసి పాల్గొన్న గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు.. ఆస్తుల కోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్‌రెడ్డి అని తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సీపట్నం రామారావుపేట సెంటర్ వద్ద జనసేన నియోజవర్గం ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో, ఎలమంచిలిలో కూటమి నేతల ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాయకరావుపేట టీడీపీ కార్యాలయం వద్ద భారీ కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ వెన్నుపోటు దినం



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదంటూ వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు బుధవారం 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలమంచిలిలో మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో క్యాంపు ఆయన కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో మాడుగులలో బస్టాండ్ ఆవరణ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, పార్టీ శ్రేణులు చోడవరంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దారు కార్యాలయం వద్ద చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నినాదాలు చేశారు. పాయకరావుపేటలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. పాత పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనకాపల్లి రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

కొత్తపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గతంలో పరవాడ మండలం వెన్నెలపాలెం కార్యదర్శిగా విధి నిర్వహణ

- కల్యాణ మండపం అద్దె డబ్బులు దుర్వినియోగంపై ఫిర్యాదు
- విచారణలో వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేసిన కలెక్టర్

రాంబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు విచారణలో తేలడంతో మండలంలోని కొత్తపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సీహెచ్ వరలక్ష్మిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గతంలో పరవాడ మండలం వెన్నెలపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. పంచాయతీ ఆధీనంలోగల ఏసీ కల్యాణ మండపం అద్దెల ద్వారా వచ్చిన ఆదాయంలో 20 లక్షల రూపాయలకుపైగా దుర్వినియోగం అయినట్టు గ్రామానికి చెందిన గొంప మారునాయుడు గత సంవత్సరం డిసెంబరు 30న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యలపరిష్కార వేదిలో ఫిర్యాదు ... మిగతా 8వ పేజీలో

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


అలుగోలు జోగిరాజు (ఫైల్)

పాయకరావుపేట రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
వడదెబ్బకు గురై ఉపాధి కూలీ మృతిచెందాడు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన అలుగోలు జోగిరాజు(60) బుధవారం ఉదయం సహచర కూలీలతో కలిసి ఉపాధి పనులకు వెళ్లాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగిలింది. మధ్యాహ్నం ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తరువాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.


నిర్మానుష్యంగా మారిన చోడవరం ప్రధాన రహదారి

రారెత్తించిన ఎండ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలు

అనకాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత అధికంగా వుంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు ఉక్కపోత నెలకొనడంతో జనం ఇబ్బంది పడ్డారు. గత వారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఇదే సమయంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వర్షాలు కొనసాగుతాయని అంతా భావించారు. కానీ అందుకు భిన్నంగా మూడు రోజుల నుంచి ఎండ తీవ్ర క్రమేపీ పెరుగుతున్నది. సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతి రుతు పవనాలు ప్రవేశిస్తాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా.. జిల్లాలో ఆ ప్రభావం కనిపించడంలేదు. జిల్లాలో 35 నుంచి 40 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ చుర్రుమంటున్నది. 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు రహదారులపై జనం సంచారం బాగా తక్కువ వుంటున్నది. ఎండ తీవ్రతకుతోడు ఉక్కబోతతో జనం విలవిలలాడుతున్నారు.

దొడ్డిదారిన ఆశీలు వసూళ్లు

మోసయ్యపేట సంతలో అనధికార వ్యక్తి పెత్తనం

- ఆశీలు వసూలుకు వేలం పాట నిర్వహించని అధికారులు
- పాత కాంట్రాక్టర్ చేతికే పగ్గాలు
- గత వేలం పాట సొమ్ములో రూ.2 లక్షలు పెండింగ్
- సర్పంచ్ బంధువు కావడమే కారణమన్న ఆరోపణలు


క్రయవిక్రయదారులతో సందడిగా ఉన్న మోసయ్యపేట సంత

అచ్యుతాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి):
మండల కేంద్రానికి సమీపంలోని మోసయ్యపేట సంత ఆశీలు వసూలు వివాదాస్పదంగా మారింది. అధికారులు వేలం పాట నిర్వహించకుండా.. పాత కాంట్రాక్టర్‌తోనే ఆశీలు వసూలు చేయిస్తున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడుతున్నదని పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

గాజువాక- ఎలమంచిలిలో రోడ్డులో స్థానిక గురుకుల బాలికల పాఠశాల వద్ద మోసయ్యపేట సంత జరుగుతుంది. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో జరిగే ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడకు తీసుకువచ్చి అమ్ము కుంటుంటారు. ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో పలు పట్టణాలకు చెందిన దళారులు, వ్యాపారులు ఇక్కడకు వచ్చి కూరగాయలు కొనుగోలుచేసి తీసుకెళుతుంటారు. సంతలో వ్యాపారాలు చేసుకునే వారి నుంచి ఆశీలు వసూలు కోసం పంచాయతీ అధికారులు ఏటా మార్చిలో వేలం పాట నిర్వహిస్తారు. ఏప్రిల్ నుంచి కొత్త కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేసుకుంటారు. ఈ మేరకు పత్రికల్లో ప్రకటన కూడా ఇస్తారు. గత ... మిగతా 8వ పేజీలో

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గ్రామాల అభివృద్ధికి మరింత చిత్తశుద్ధితో పనిచేయండి
- ఉపాధి హామీలో తప్పుడు మస్తర్లు సహించం
- రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జి.శిరీషా అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో తప్పుడు మస్తర్లు వేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకతవకలు జరగకుండా ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ను ఇంటిపై ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకు రాగా, అధికారులు సమాధానాలు ఇచ్చారు. అధికారులు మండల సమావేశాలకు వచ్చేటప్పుడు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయమాధవి, వైస్ ఎంపీపీ కె.నర్సింగరావు, ఈవో పీఆర్‌డీ రాజు, ఆర్‌ఐ రవికుమార్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : కన్నబాబు


మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణుల నిరసన

ఎలమంచిలి/మునగపాక, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు బుధవారం వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎలమంచిలిలో నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలన అభివృద్ధి, సంక్షే మ మే అజెండాగా సాగిందన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తా, నాలుగు మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వైసీపీ నాయకులు మద్దాల వీరునాయుడు, దాసరి అప్పారావు, కాండ్రేగుల జగన్, నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశిబాబు పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రకు పునాదిగా ఏడాది పాలన

- రానున్న నాలుగేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి
- నాలుగు మండలాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయకుమార్


మునగపాకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మునగపాక, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్రప్రదేశ్‌కు పునాదిగా కూటమి ఏడాది పాలన నిలిచిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండల కేంద్రం మునగపాకలో బుధవారం ఏడాది పాలన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వెనుకబడిన మునగపాక మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణతో పాటు గ్రామాలను అనుసంధానం చేస్తూ పలు రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా విధ్వంసం చేసిన జగన్, ఇప్పుడు రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్‌లకు భరోసా పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. తొలుత మెయిన్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా నందీశ్వర ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఎ.వి.సత్యనారాయణ. కె.చంద్రమోహన్, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, బద్దెం సూర్యనారాయణ, దాడి మునిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మునగపాక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, కడియం అనూరాధ, దాడి శివ, విల్లూరి నర్సింగరావు, సబ్బి శ్రీను, కె.పి.రావు, ఆడారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : రాష్ట్రంలో ఏడాదిగా సుపరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా రాంబిల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన సంబరాల్లో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో రానున్న నాలుగేళ్ల ప్రజారంజక పాలన సాగుతుందన్నారు. ఐదేళ్ల రాక్షస పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వైసీపీ అధినేత జగన్‌కు బుద్ధి రావడం లేదని ఎద్దేవా చేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ మండల నాయకుడు వి.దిన్‌బాబు, జనసేన మండలశాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొరలతో పాటు పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయి సుపరిపాలన అందిస్తున్న సందర్భంగా ఆయా పార్టీల నేతలు ఎలమంచిలిలో సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా పలువురు మాట్లాడుతూ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలన విధ్వంసంగా సాగిందని ఎద్దేవా చేశారు. అదే విధంగా మర్రిబంద గ్రామంలో స్థానిక కూటమి నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు గుర్రాల శేఖర్, కృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. బుధవారం రాత్రి అచ్యుతాపురంలో ఏర్పాటైన వేడుకల్లో మాట్లాడారు. సొంత చెల్లి, తల్లికే వెన్నుపోటు పొడిచిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, పైల రామునాయుడు, టెక్కలి పరశురామ్, డ్రీమ్స్ నాయుడు, కూండ్రపు రమణ, దేశంశెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలిలో జనసేన పార్టీ నాయకులు సంబరాలు

పర్యాటక ప్రాంతంగా ఆవ

- కలెక్టర్ విజయకృష్ణన్

అచ్యుతాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల ఆవను కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఆవను వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972 కింద కన్సర్వేషన్ రిజర్వుగా ప్రభుత్వం ఇటీవలే ప్రకటించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు కలెక్టర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆవ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. సర్వే జరిపి, సరిహద్దులను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. పరిసర ప్రాంతాల నుంచి ఎటువంటి మురుగునీరు ఆవలో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రిసార్ట్స్ నిర్మాణం, వినోదం, బోటింగ్ వంటి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పర్యాటకానికి ఎంత భూమి అందుబాటులో ఉంది, జెట్టీ నిర్మించడానికి తగిన ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. ఆవలో చేపల వేటపై జీవనోపాధి పొందుతున్న మత్స్యకారుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకం ద్వారా ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

'జనవాణితో సమస్యల పరిష్కారం'

రాంబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జనవాణి కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. బుధవారం రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

- అభివృద్ధిపై కలెక్టర్, ఎమ్మెల్యే, లారస్ ప్రతినిధులు చర్చ

ఎలమంచిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కృషికి తోడు సెజ్‌లోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో కళాశాలలో సుమారు రూ.రెండున్నర కోట్లవ్యయంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సదరు డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఆమెతో పాటు ఎమ్మెల్యే విజయ్ కుమార్, లారస్ పరిశ్రమ ప్రతినిధులు కలిసి కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధి విధానాలపై చర్చించారు. కలెక్టర్‌కు మ్యాప్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న వసతి సదుపాయాలను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ద్వారా తెలుసుకున్నారు. కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కూడా ఉండడంతో సుమారు 794 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. వీరందరికీ పూర్తిస్థాయిలో సదుపాయాలు లేవని, సుమారు మరో 20 తరగతి గదులు నిర్మాణం చేపట్టాల్సి ఉందని వివరించారు. దీంతో సీఎస్ఆర్ నిధులు వెచ్చించి నూతన తరగతి గదులు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం చేశారు. ఇదే కళాశాలలో ఎమ్మెస్సీ విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థికి లారస్ పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ ఇప్పించిన అనంతరం వారందరికీ ఉపాధి కల్పించేలా ఎంఓయూ కుదుర్చుకున్నట్టు తెలిసింది. అనంతరం కలెక్టర్ మునిసిపాలిటీ పరిధి శేషుకొండ సమీపంలో చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వరహాలు, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి, టీపీవో శ్రీలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

కొత్తూరు వద్ద నవోదయ, కేవీ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాంబిల్లి : మండలంలోని పంచదార్ల గ్రామం వద్ద నవోదయ, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయకుమార్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పది ఎకరాలు, నవోదయకు 32 ఎకరాల స్థలం పరిశీలించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలకు తహసీల్దార్ శ్రీనివాసరావు ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీన రాంబిల్లి మండలం కొత్తూరు వద్ద గల బౌద్ధక్షేత్రం ఆవరణలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి కలెక్టర్, ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.


కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు

కూటమి నాయకుల సంబరాలు

పాయకరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో బుధవారం పాయకరావుపేటలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం భారీగా బాణాసంచాను కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, సూరా సుబ్రహ్మణ్యం, వేములపూడి అప్పారావు, జనసేన పార్టీ నాయకులు ఆచంట దొర, నారపురెడ్డి పద్మావతి, ఇంజరపు సూరిబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుపై అవగాహన


వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నక్కపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపూడి, వేంపాడు, ఉద్దండపురం గ్రామాల్లో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వాణిజ్య పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు, యాంత్రీకరణ విధానం అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను సాధించడం తదితర అంశాలపై రాజమహేంద్రవరం వాణిజ్య పంటల పరి శోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ప్రభాకర్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సంయుక్తంగా ఒకే వ్యవసాయం, ఒకే యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అన్ని రకాల సమస్యలు, చీడపీడలను నియంత్రించవచ్చునని చెప్పారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ రైతులకు మరికొన్ని అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ, రైతులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు


యోగాసనాల వేసిన బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

పాయకరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు యోగాసనాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు ఎస్.సీతారామమూర్తి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, యోగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. అనంతరం యోగాసనాలపై చిత్రలేఖనం పోటీలు, అలాగే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వివిధ తరగతుల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముతా కాలువలో పూడికతీత పనులు


ముతా కాలువలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, కాకినాడ జిల్లా తుని మండలాల్లోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందించే ముతా కాలువలో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని తాండవ నదిపై ఉన్న ముతా ఆనకట్ట నుంచి ప్రారంభమయ్యే ముతా పంట కాలువ వద్ద కాలువ ఛైర్మన్ చించెలపు రామారావు తదితరులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట జలవనరుల శాఖ డీఈఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ముతా పంట కాలువ ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు డక్కన్ కెమికల్స్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో ముతా ఆనకట్ట నుంచి ముతా పంట కాలువలో సుమారు ఐదు కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువలో పూడికతీత పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, నాయకులు కలిగట్ల మూలాస్వామి, దివాణం పాల్గొన్నారు.

పాయకరావుపేటలో 'వెన్నుపోటు దినం'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం పాయకరావుపేటలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కంబాల జోగులుతో పాటు వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబీ తదితరులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించిన, కారాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండగా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌తోపాటు మరో 143 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కూటమి పార్టీలను నమ్మి ఓట్లేసిన ప్రజలకు వెన్నుపోటు తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కోతల ప్రభుత్వమేగాని, చేతల ప్రభుత్వం కాదని ప్రజలకు అర్థమైందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వైఎస్.జగన్ సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇసరపు తాతారావు, జగతా శ్రీను, దేవవరపు వెంకటేశ్వరరావు, రాజేష్‌ఖన్నా తదితరులతోపాటు నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన వైసీపీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శరణ్య వేంకటేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపు

ఎస్.రాయవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురం గ్రామంలో శరణ్య వేంకటేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉప్పలపాటి వేంకట సూర్యనారాయణరాజు, అరుణకుమారి దంపతులు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రధాన ఋత్వికులు వాడపల్లి గోపాలాచార్యుల సమక్షంలో నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం నుంచి నూతన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు జరుపుతున్నారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలో ప్రతిష్ఠించే శరణ్య వేంకటేశ్వరస్వామి నూతన విగ్రహాన్ని గ్రామంలోని పుర వీధుల్లో మహిళల కోలాటం నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయంలో స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.


తిమ్మాపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపులో కోలాటం నిర్వహిస్తున్న మహిళలు... (ఇన్‌సెట్‌లో) శరణ్య వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

నక్కపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఆద్యంతం అలరించాయి. జాతీయ గీతం, త్రివర్ణ పతాకం, భరత మాత గొప్పతనం వివరిస్తూ సుష్మ, కావ్య చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 6వ తేదీన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి జనార్దన్ చెప్పారు.

యోగా, పెయింటింగ్ పోటీలకు విశేష స్పందన


పెయింటింగ్ పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

నక్కపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు విభాగాలకు సంబంధించి నిర్వహించిన యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. ఎంపీడీవో డి.సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి, వేంపాడు ఆయుష్ డాక్టర్ కె.రఘు పర్యవేక్షణలో 19 నుంచి 35 ఏళ్లు, 35 ఏళ్ల పైబడిన వారికి యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలపై పోటీలు నిర్వహించారు. పిల్లలకు పెయింటింగ్, స్కిట్, యోగా సాంగ్ వంటి విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. నక్కపల్లి మండలంలోని డీఎల్‌పురం ఎంపీటీసీ సభ్యుడు కె.కనకరావు సైతం 57 ఏళ్ల వయస్సులో యోగాంధ్ర పోటీల్లో పాల్గొని చక్కని ఆసనాలతో అధికారులను సంభ్రమాశ్చర్యానికి గురి చేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు దవరసింగి రాంబాబు, ఈవోఈఆర్‌డీ శ్రీను, కార్యదర్శి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జనం విలవిల

ఎస్.రాయవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎండలు ఒక్కసారిగా మండాయి. ఉదయం పది గంటల నుంచే భానుడు భగ్గుమన్నాడు. దీనికితోడు వేడి గాలులు జనానికి సెగలు పుట్టించాయి. ఎండ భగభగ మండడంతో సూర్య కిరణాల దాటికి గ్రామాల్లో చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు విలవిలలాడిపోయారు. అలాగే వేడి గాలులకు జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ ఎండను చూసి చాలా వరకు జనాలు భయంతో బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇటువంటి ఎండను ఈ వేసవి కాలంలో ఎప్పుడూ చూడదని పలువురు పేర్కొన్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరిస్తా

▸▸ జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ రమణ వెల్లడి
▸▸ సత్యనారాయణపురం పంచాయతీలో ఇళ్ల సముదాయం పరిశీలన



టిడ్కో గృహాల్లో సమస్యలను తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ రమణ

కొత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న టిడ్కో గృహాలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి.వి. రమణ బుధవారం పరిశీలించారు. ఎన్టీఆర్ నగర్‌లో సమస్యలపై వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ విషయాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీకి వివరించారు. దీంతో ఎట్టకేలకు జోనల్ కమిషనర్ ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న సమస్యలను నేరుగా పరిశీలించారు. ప్రధానంగా తాగునీరు, సరైన రోడ్లు, శానిటైజేషన్ తదితర సమస్యలు ఉన్నాయని కూటమి నాయకులు మళ్ల శ్రీను, పొలమరశెట్టి నూకరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు దంగేటి ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొండా ప్రసాద్, కార్యదర్శి పెంటకోట ప్రసాద్‌లతో పాటు నివాసితులు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న నల్లమారమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పెదిరెడ్డి ముత్తుస్వామి, కాండ్రేగుల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలులోకి తేవాలి'



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న సమాఖ్య జిల్లా కార్యదర్శి పరమేశ్వరి

పరవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలులోకి తేవాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. జాతీయ మహిళా సమాఖ్య వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు ఎంత రాణిస్తున్నా గుర్తింపునకు నోచుకోవడం లేదని వాపోయారు. సిందూర్ ఆపరేషన్‌కు నాయకత్వం వహించి టెర్రరిస్టుల వెన్నులో వణుకు పుట్టించిన సోఫియా ఖురేషి, వ్యోమికాసింగ్‌ల కులాలను అడ్డుపెట్టి బీజేపీ ఎంపీలే అవమానించడం దేశద్రోహం కంటే తీవ్రమైన నేరమన్నారు. వారిపై కేసులు పెట్టి మహిళల గౌరవాన్ని, దేశప్రతిష్ఠను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు దేవుడమ్మ, పుష్పలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తోడపెద్దు అచ్చుపోతకు ముహూర్తపు రాట



చినరామస్వామి కోవెల వద్ద ముహూర్తపు రాట వేస్తున్న పైడారావు తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం చినరామస్వామి ఆలయం సూరిశెట్టి వారి తోడపెద్దు అచ్చు కార్యక్రమంలో భాగంగా బుధవారం విల్లూరి అక్కయ్యగారివీధి సింహాద్రి అప్పన్న చావిడిలో రాటోత్సవాన్ని నిర్వహించారు. చినరామస్వామి ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ విల్లూరి పైడారావు, వాణి దంపతులు రాట వేశారు ఈ సందర్భంగా పైడారావు మాట్లాడుతూ ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో జిల్లాలోని 30 తోడపెద్దులతో ఊరేగింపు నిర్వహించనున్నట్టు తెలిపారు. భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మీనాయుడు, నిర్వాహకులు పిళ్లా లక్ష్మణరావు, శంకరరావు, కర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

అనకాపల్లి కలక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల పిల్లలకు అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు బుధవారం కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అనకాపల్లిలో ఏపీయూడబ్ల్యూజే భవనానికి స్థలంతో పాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఎం. శ్రీనివాసరావు, మున్నా, రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు జాతీయ అవార్డులను అందించేందుకు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో వీటిని అందించనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి జులై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు www.depwd.gov.in, www.awards.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.



నూకాంబిక ఆలయంలో టీడీపీ నేతలు సురేంద్ర తదితరుల పూజలు



పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో వేడుకలు



సబ్బవరంలో ముగ్గుల పోటీల విజేతకు బహుమతి ప్రదానం

కూటమి పాలనకు జేజేలు

▸▸ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నెన్నో విజయాలు ▸▸ ఓటమి నుంచి పాఠాలు నేర్వని వైసీపీకి మున్ముందు మరింత భంగపాటు ▸▸ విజయోత్సవ సంబరాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

కొత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అధికార గర్వంతో విర్రవీగిన జగన్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పి ఏడాది పూర్తయిందని, నాటి నుంచి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోందని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు 'సుపరిపాలన మొదలై ఏడాది - పీడ విరగడై ఏడాది' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి గెలిచిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు జనరంజక పాలన అందిస్తుండడంతో వైసీపీ శ్రేణులు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. అందుకే వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా నిర్వహించిన మహిళల ముగ్గుల పోటీని పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కూటమి నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, ఆళ్ల రామచంద్రరావు, కర్రి సత్యనారాయణ, దొడ్డి నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

ఆలయాల్లో టీడీపీ నాయకులు పూజలు

అనకాపల్లి టౌన్ : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తూ, సుపరిపాలన అందిస్తున్న సందర్భంగా ఇక్కడి దేవాలయాల్లో కూటమి నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాంబిక ఆలయంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీనులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాగానే మోసం చేశారన్నారు. ఇది గుర్తించిన ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పినా అతనిలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి శంకరరావు, పొలిమేర ఆనంద్, సూరే సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో రాష్ట్రంలో, కేంద్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపేటి సంతోష్‌కుమార్, మళ్ల సూరిబాబు, దూలం సత్యవతి, పెంటకోట గణేష్‌కుమార్, ఎలమంచిలి బంగార్రాజు, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెంలో...

పరవాడ : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే సుపరిపాలన అందిస్తూ, అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతోందని జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ అన్నారు. జగన్ పీడ విరగడై, కూటమి పాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ముత్యాలమ్మపాలెంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కలలుగన్న అమరావతి రాజధాని మహానగరంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, మోటూరి సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, పిళ్లా శివకృష్ణ, కూండ్రపు శ్రీరామ్మూర్తి, అర్జిల్లి దేవి, గొన్నా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమై, సుపరిపాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సబ్బవరంలోని సాయినగర్ కాలనీలో జనసేన నాయకులు వేడుకలు నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంటరమణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటే, కూటమి పాలనలో అంతా ఆనందంగా ఉన్నారన్నారు. అంతకుముందు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, గండి దుర్గాప్రసాద్, గొర్లి కుమార్, కొల్లి కృష్ణ, టి శేఖర్, బంతికోళ్ల పద్మ, పల్లి మంగరాజు, జెట్టి ప్రసాద్, కర్రి నర్సింగరావు, వల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను నమ్మించి మోసం చేసిన ప్రభుత్వం'

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ తీరుకు నిరసనగా వైసీపీ నాయకులు బుధవారం వెన్నుపోటు దినంగా ప్రకటిస్తూ ఇక్కడ ప్రదర్శన నిర్వహించారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, గోవింద్, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, బొడ్డేడ శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన ప్రదర్శన చేపడుతున్న వైసీపీ శ్రేణులు

నేడు దుర్గమాంబ పండుగ



లంకెలపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ శివారు పచ్చికోరువానిపాలెంలో దుర్గమాంబ పండుగను గురువారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. వేకువ జామున అమ్మవారికి విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధి అలమండ నరేశ్ తెలిపారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు



వృద్ధుడికి కంటి పరీక్ష జరుపుతున్న వైద్యుడు

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జూనియర్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆస్పత్రి వైద్య సిబ్బంది 60 మంది సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు జరిపారు. డాక్టర్లు వేదవతి, అయ్యప్ప, వెంకట్‌లతో పాటు సంఘం ప్రతినిధులు గౌరీపతి, సుబ్బారావు, ఎంవీవీ స్వామి, విల్లూరి సత్యనారాయణ, బుద్ధ వీరునాయుడు, కేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

▸▸ జమాదులపాలెం కాలనీలో అర్ధంతరంగా నిలిచిన కాలువ పనులు ▸▸ ఆయా గోతుల్లో పడుతూ పలువురికి గాయాలు





జమాదులపాలెం కాలనీలో అసంపూర్తిగా నిలిచిన కాలువల నిర్మాణం

కశింకోట, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమాదులపాలెంలో రావిచెట్టు జంక్షన్ నుంచి కరకవారి కాలనీకి వెళ్లే కింద వీధి రహదారిలో రోడ్లు పూర్తిచేసినా కాలువల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వర్షం వచ్చినప్పుడు ఆయా ప్రాంతాల్లో నీరు నిండిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఆయా గోతుల్లో పడి పలువురు గాయాలకు గురవుతున్నారు. ఒక్కోసారి ఆ గోతుల్లో నీరు రోజుల తరబడి నిలిచి మురుగుగా మారుతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు రాత్రి వేళల్లో ఇక్కడ ప్రమాదాలబారిన పడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి అసంపూర్తిగా నిర్మించిన కాలువలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసి గ్రామస్తులకు అందుబాటులో తేవాలని వారంతా కోరుతున్నారు. ఇదిలావుంటే, జాతీయ రహదారి నుంచి జమాదులపాలెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతులమయంగా ఉన్న రోడ్డుపై రాత్రి సమయం ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల వీధి లైట్లు లేకపోవడంతో చీకటిపడితే అంధకారం అలముకుంటోంది.

సుదూర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చే రోజు వారీ కార్మికులు ప్రమాదాలకు కూడా గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రధాన రోడ్డును మరమ్మతులు చేపట్టి, వీధి లైట్లు అన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

గంటి, కొర్ర అధిక దిగుబడి రకాలు మేలు

అనకాపల్లి అగ్రికల్చర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంటి, కొర్ర, నేరుగా వరి వేసుకొనే రైతులకు ప్రస్తుత సీజన్ అనుకూలంగా ఉందని, వీటితో పాటు ఖరీఫ్ వరికి ముందు పచ్చిరొట్ట పంటలు కూడా వేసుకోవచ్చునని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు బుధవారం తెలిపారు. గంటిలో అధిక దిగుబడి నిచ్చే హెచ్‌హెచ్‌బి-67, ఐసీఎంహెచ్-356, వంటి హైబ్రీడ్ రకాలను వేయాలని సూచించారు. కొర్రలో స్వల్పకాలిక రకాలైన గరుడ, సూర్యనంది, రేనాడు వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వరినారుమళ్లను తయారు చేసుకునేందుకు నేలను దున్ని సిద్ధం చేయాలని, వరి మాగాళుల్లో జనుము, జిలుగు, పిల్లిపెసర, పెసర లాంటి పచ్చిరొట్ట పంటలు వేసుకోవడం మంచిదన్నారు. వర్షాధార చెరకు వేసే రైతులు ముదురు గడల నుంచి విత్తనాన్ని సేకరించి విత్తన శుద్ధి చేయాలని సూచించారు.

ఆర్ఏఆర్ఎస్‌లో విక్రయానికి చెరకు

అనకాపల్లి అగ్రికల్చర్, జూన్4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వ్యవసాయ పరిశోధనా స్థానంలో 15 టన్నుల చెరకు విక్రయానికి సిద్ధంగా ఉందని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి తెలిపారు. బెల్లం తయారు రైతులు, చెరకు రసం విక్రయదారులు వినియోగించుకోవచ్చునన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులో గల కన్యకాపరమేశ్వరీ ఆలయ జంక్షన్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు నేతలు బుధవారం నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. పీవీఎం నాగజ్యోతి, బిళ్ళపాటి కృష్ణకుమార్, గంగుపాం నాగేశ్వరరావు, పీఎంఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి బాబ్జీ పరామర్శ



రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బాబ్జీ

సబ్బవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నల్లరేగులపాలెం శివారు ద్వారకానగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఆయకట్టు సంఘం అధ్యక్షుడు కాగిత రమణ కుమార్తె తేజ ఇటీవల మృతిచెందడంతో సదరు కుటుంబాన్ని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, నాయకులు భరణికాన బాబూరావు, బొండా సత్యారావు, వీబీవీఎస్ఎన్ రాజు, దాసరి రమణ పాల్గొన్నారు.


అరకులోయలో ముగ్గులను పరిశీలిస్తున్న దొన్నుదొర, నాయకులు


పాడేరులో కేక్ కట్ చేసి నేతలకు తినిపిస్తున్న జనసేన ఇన్‌చార్జి గంగులయ్య

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

- విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర
- ఘనంగా 'వైసీపీ పీడ విరగడై ఏడాది' సంబరాలు

అరకులోయ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించి, కూటమి నేతృత్వంలో ఏడాదిగా సుపరిపాలన అందుబాటులోకి వచ్చినట్టు విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర అన్నారు. అరకులోయలో దొన్నుదొర ఆధ్వర్యంలో సుపరిపాలనకు ఏడాది కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ షాంపిక్ కాంప్లెక్స్ ఎదుట కూటమి పేరిట ముగ్గులతో అలంకరించారు.సీనియర్ నేతలు సర్పంచ్‌లు దాసుబాబు, శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏడాదిపాలన విజయోత్సవ సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ చం ద్రబాబు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపేట ఈ ఏడాదిలో తన మార్కు పాలన అందిసంచారన్నారు. అమరావతిలో నూతన రాజధాని నిర్మాణం చేపడుతున్నారు.70 శాతం పైగా హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కే దక్కుతుందని జనసేన ఇన్‌చార్జి చిరంజీవి ఈ సందర్భంగా స్పష్టంచేశారు. టీడీపీ మండల తాజా, మాజీ అధ్యక్షులు సుబ్బారావు, మహాదేవ్, ఆనంద్ తదితరులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పాడేరులో జనసేన నేతృత్వంలో..

పాడేరు: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని జనసేన పార్టీ అరకులోయ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అయిన సందర్భంగా 'సుపరిపాలనకు ఏడాది... వైసీపీ పీడ విరగడై ఏడాది' పేరిట బుధవారం ఇక్కడ జనసైనికులు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సెంటర్‌లో కేకు కట్ చేసి పంచి పెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు వైసీపీ పీడ విరగడై కూటమి సుపరిపాలన వచ్చి ఏడాదైనందున పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించినట్టు చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసి నరకాసుడిని దహించినట్లుగా ప్రజలు వైసీపీ అనే పీడను దూరం చేశారన్నారు. దీంతో సుపరిపాలనతో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. జనసైనికులు బాణా సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కిట్లంగి పద్మ, బొంకుల దివ్యలత, కొర్రా కమల్, సీహెచ్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడాదిలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

గూడెంకొత్తవీధి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీటవేసిందని టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్ అన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అడవి తల్లిబాట కార్యక్రమంలో భాగంగా రూ.వెయ్యి కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారన్నారు.పేదలకు 35వేల పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. మరో రెండు నెలల్లో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం చేరుకు చర్యలు ప్రారంభించిందన్నారు. దేవరాపల్లిలోనూ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గంటా నళిని, ఎంపీటీసీ సభ్యురాలు రాగమణి, బీజేపీ మండలాధ్యక్షుడు శేఖర్, జనసేన నాయకులు వీరవెంకట్, బాలు, ముక్కలి మహేశ్, కొర్ర బలరామ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం డుంబ్రిగుడలో టీడీపీ నాయకులు, జనసైనికులు సంబరాలు చేశారు. జనసేన ,టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు దనేశ్వరరావు, ఆనంద్ మాట్లాడారు. మండల కేంద్రలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు చీరలు బహుమతిగా అందజేశారు.జనసేన పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రామదాసు, టీడీపీ మండల మాజీ అ. ద్యక్షుడు సుబ్బారావు, మధు, కోములు నాయుడు రులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గులు పోటీలు

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ హెక్టాగుడ గ్రామంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఏడాదైన సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిట్టం మురళీ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల గుర్తులు వేసి మహిళలు ఆకట్టుకున్నారు. అనంతరం యువతులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, యువ జన నాయకుడు బాబీ, భీమన్న, తదితరులు రవి, పాల్గొన్నారు.


అనంతగిరి: హెక్టాగుడలో జనసే, టీడీపీ, బీజేపీ గుర్తులతో ముగ్గులు

పెదబయలులో..

పెదబయలు: పెదబయలంలో కూటమి ఏర్పాటై ఏడాది సంబరాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చి నినాదాల హోరెత్తించారు. స్వీట్స్ ను పంచిపెట్టారు.


పెదబయలులోనిర్వహించిన వేడుకలో ఎన్డీఏ శ్రేణులు


జీకే వీధిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకంచేస్తున్న నేతలు

టీబీ లక్షణాలున్న వారికి కళ్లె పరీక్ష తప్పనిసరి

- డీఎంహెచ్‌వో జమీల్ బాషా


ఈదులపాలెంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీబీ లక్షణాలతో బాధపడే వారు పంచాయతీ కేంద్రాలకు వచ్చే 104 మెడికల్ క్యాంప్‌ల్లో కళ్లె (కఫం) పరీక్షలను చేయించుకోవాలని డీఎంహెచ్‌వో షేక్ జమీల్‌బాషా సూచించారు. జిల్లా క్షయ విభాగం ఆధ్వర్యంలో మండల పరిధి ఈదులపాలెంలో టీబీపై 100 రోజుల కార్యక్రమం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు బుధవారం భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం రావడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు గల వారు వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో టీబీ లక్షణాలు గల వారిని గుర్తింపునకు చేపడుతున్న సర్వేలో ఆశలు, వైద్య సిబ్బంది చురుగ్గా పాల్గొవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ విభాగం ఎంవోడీటీ సూర్యనారాయణమ్మ, ఎంవోడీసీ డాక్టర్.రేఖ, మినుములూరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీను, నరసింగరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల నియామకాల చట్టం చేసే వరకు దీక్షలు

- ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్



రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ఏర్పాటు చేసేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో అన్ని ఐటీడీఏల వద్ద గత 22 రోజులుగా ఆదివాసీ జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్షలను చేస్తున్నారన్నారు. పాడేరు ఐటీడీఏ వద్ద జేఏసీ నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బృంద సభ్యులు బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ (భద్రాచలం) మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలు కాపాడుకునేందుకు చేస్తున్న ఈ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ శిబిరాన్ని సందర్శించిన వారిలో సోడే వెంకటరావు, ఎం.భీమయ్య, సురేశ్‌కుమార్ (ఎటపాక), సత్తిబాబు (ఆర్.పురం), రత్తయ్య (కూనవరం), శ్రీనివాస్‌దొర, కాకర రత్తయ్యలు పాల్గొన్నారు.

క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ ప్రతినిధులు

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పాడేరులో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవం స్థానిక సీయోను ప్రార్థనా మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రార్థనలు, యెహోవా గీతాలపనలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. ప్రెసిడెంట్‌గా ఆర్.అరుణ్ దయాల్ తిమోతి, ప్రధాన కార్యదర్శిగా కె.సుజిత్, కోశాధికారిగా పి.గ్లోరియస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూసీవైఏ చీఫ్ ఆర్.జాన్, పాస్టర్లు సీహెచ్.దైవకృప, సోల్మన్‌రాజు, జాన్ ఫెడ్రిక్, రత్నం, యోబు, యూసీవైఏ సభ్యులు, కర్మెల్ బృందం, పెదబయలు క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు, అరకులోయ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలాలు ఖాళీ చేయాలని 38 మందికి నోటీసులు

చింతపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ స్థలాలు ఖాళీ చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులు బుధవారం 38మందికి నోటీసులు ఇచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు మండల కేంద్రంలో ఆక్రమణ తొలగింపునకు రెవెన్యూశాఖ చర్యలు చేపడుతోంది. హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు 160మంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. గత వారంలో పది మంది వర్తకులకు నోటీసులు ఇచ్చారు. తాజాగా మరో 38మందికి నోటీసులు అందజేశారు. నాలుగురోజుల కిందట తొలగింపునకు సిద్ధం కాగా, స్థానికుల విజ్ఞప్తి మేరకు రెవెన్యూ అధికారులు వారం రోజులు గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొంత మంది వర్తకులు ఆర్‌అండ్‌బీ స్థలాల్లోని దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. మిగిలిన వారికి నోటీసులు అందజేసి, మూడు రోజుల్లో ఆర్‌అండ్‌బీ స్థలాలను ఖాళీ చేయకపోతే కట్టడాలను కూల్చివేస్తామని తహసీల్దార్ టి. రామకృష్ణ పేర్కొన్నారు. వీఆర్వోలు పండన్న, విష్ణు, రాజు స్వయంగా వెళ్లి నోటీసులు అందజేస్తున్నారు.

రేషన్ బియ్యం కొలతల్లో తేడా రాకూడదు: తహసీల్దార్


రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డీఆర్ డిపోల్లో కచ్చితమైన తూకానికి రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం చింతపల్లి-1 డీఆర్ డిపోని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్ డిపోల ద్వారా కేవలం ఆరు రోజుల్లోనే 50శాతం రేషన్ బియ్యం పంపిణీ జరిగిందన్నారు. నెలలో 15రోజుల వరకు డీఆర్ డిపోలు తెరచి ఉంచాలన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు డిపోల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో జీసీసీ సేల్స్‌ఉమన్ రత్నం పాల్గొన్నారు.

వృద్ధులకు ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ


వృద్ధురాలికి రేషన్ బియ్యం పంపిణీని చేస్తున్న పెదలోచలి డీఆర్‌డిపో సేల్స్‌మన్

జి.మాడుగుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలోచలి పంచాయతీ డీఆర్ డిపో సెల్స్‌మేన్ సాగిన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు ఇంటింటికీ రేషన్ సరకులు అందజేశారు. గొడుగుమామిడి పెదలోచలి తదితర గ్రామాల్లో ఉన్న వృద్ధులకు రేషన్ బియ్యంతో నిత్యవసరాలు అం దజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరులో 35.0 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఎండ సైతం ప్రతాపం చూపింది. దీంతో కొయ్యూరులో 35.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా... పాడేరులో 33.3, జీకేవీధిలో 31.6, చింతపల్లిలో 31.0, అనంతగిరి, డుంబ్రిగుడలో 30.3, జి.మాడుగులలో 29.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సీలేరులో యోగాంధ్ర


యోగాసనాలు వేస్తున్న సీఆర్‌పీఎఫ్

సీలేరు, జూన్ 4, (ఆంధ్రజ్యోతి) జీకేవీధి మండలం సీలేరులో బుధవారం సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జీవీ గౌడ మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని, రోజూ సాధన చేస్తే మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. అ నంతరం జీకేవీధి, కొయ్యూరు మండల యోగా క్యాంపెయిన్ కో ఆర్డినేటర్ హోమియో వైద్యాధికారి సుజనారాయ్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి తగ్గి, అవయవాల్లో రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు ఎ. సత్యనారాయణ వివిధ ఆసనాలతో చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేఏన్ కృష్ణ, ఏఎస్ఐ అశోక్, సివిల్ ఎస్ఐ రవీంద్ర, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కే సౌమ్య, హెచ్ఎస్ త్రినాధ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


కొట్నాపల్లి సబ్ సెంటరులో గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా

హుకుంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని డీఎంహెచ్‌వో జమీల్ బాషా అన్నారు. బుధవారం మండలంలోని పెదగరువు, కోట్నాపల్లి సబ్‌సెంటర్లను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు అందించారు హుకుంపేటపీహెచ్‌సీ ని సందరించారు. రోజూ వచ్చే రోగుల సంఖ్య గర్భిణుల వివరాలను తెలుసుకున్నారు. మందులు గది, రక్త పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్ రోగులవైద్యం విషయంలో జాగ్రత్త ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సౌజన్య సూపర్‌వైజర్ సదానందం సిబ్బంది ఉన్నారు

పక్కాగా మధ్యాహ్న భోజన పథకం అమలు

హుకుంపేట జూన్ 4 ఆంధ్రజ్యోతి ; ప్రభుత్వ పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని ఎంఈవో ఈశ్వరరావు ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని 33 పంచాయతీలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులతో స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ఆవరణలను శుభ్రం చేసి ముందుగా సిద్ధం చేయాలని సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలన్నారు. సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- 'వెన్నుపోటు దినం'లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, వైసీపీ నేతలు

పాడేరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా బుధవారం వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రభుత్వ తీరుపై ప్రశ్నిస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు బనాయిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని ఒత్తిడులకు గురి చేసినా తాము ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తక్కువ కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలతకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అరకులోయలో చేపట్టిన నిరసనలో ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీచైర్మన్ సుభద్ర, వైసీపీ నాయకులు

అరకులోయలో..

అరకులోయ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైనట్టు అరకులోయలో ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ పిలుపుమేరకు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మత్స్యలింగం, సుభద్ర మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షురాలు ఉషారాణి, జడ్పీటీసీ సభ్యురాలు రోష్ని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చింతపల్లి సంతలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


సంతలో ట్రాఫిక్ నియంత్రిస్తున్న ఎస్ఐ వెంకట రమణ, పోలీసులు

చింతపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నా రు. బుధవారం స్థానిక ఎస్ఐ ఎం. వెంకట రమణ, పోలీసులు సంతలో తమకు కేటాయించిన స్థలంలోనే దుకాణాలను ఏర్పాటు చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. అలాగే, రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలనుతొలగించారు. హనుమా న్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయకుండా నిరోధించారు. సర్వీసు ఆటోలు, భారీ వాహనాలను సంత ప్రాంతానికి అనుమతించలేదు. దీంతో కొంత కాలంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వారం సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండగా వర్తకులు, వాహన చోదకులు, సర్వీసు జీపులు, ఆటోల యజమానులు పోలీసులకు సహకరించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ట్రాఫిక్ వల్లసంతలో అంబులెన్సులు, వీఐపీల వాహనాలు చిక్కుకుంటున్నాయన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల కడపలో 4, 5వ తరగతుల్లో 2025-26లో చేరేందుకు ఈ నెల 19వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన క్రీడాధికారి ఎ.జగన్మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలో 4వ తరగతి బాల బాలికలకు 40, 5వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 4వ తరగతి అభ్యర్థులకు 8 నుంచి 10 ఏళ్లలోపు వయస్సు, 5వ తరగతి విద్యార్థులకు 9 నుంచి 11 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జిల్లా స్థాయి శారీరక సామర్థ్య పరీక్షలు ఎంపికలకు దరఖాస్తుల స్ర్కీనింగ్ నిర్వహిస్తామన్నారు. జూలై 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జిల్లా స్థాయి శారీరక సామర్థ్య ఎంపికలు, జూలై 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారన్నారు. ఇతర వివరాలకు ఫోన్లు: 91211 06834, 9000 274225 సంప్రదించాలన్నారు.

'స్పెషల్ డీఎస్సీ నిర్వహణకు టీఏసీలో తీర్మానం చేయాలి'

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన 2025 మెగా డీఎస్సీ నుంచి షెడ్యూల్ ఏరియా టీచర్ పోస్టులను మినహాయించి ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసీలతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వీలుగా టీఏసీలో తీర్మానం చేయాలని కోరుతూ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీఏసీ సభ్యులకు బుధవారం వినతులు పంపించినట్టు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ చైర్మన్ కుడుముల కాంతారావు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వైసీపీ పాలనలో రద్దు చేసిన జీవో 3 స్థానంలో ప్రత్యామ్నాయ జీవో తీసుకువచ్చి 100 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు చేసి ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నాయకులు పి.అప్పలనర్స, ఆర్.జగన్మోహన్‌రావు, సీహెచ్.నాగేశ్వరరావు, కె.రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, జి.భాను, సీహెచ్ రావు, వి.దాసు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున జీకేవీధి, జి.మాడుగుల మండలాల్లో ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్‌సీహెచ్‌పాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీకేవీధి ...ఆర్‌వీనగర్ ఫీడర్ పరిధిలోని ఆర్‌వీ.నగర్, సిరిబాల, గూడెంకాలనీ, పూజారి పాకలు తదితర గ్రామాలకు, జి.మాడుగుల పరిధిలోని కొక్కిరాపల్లి, లువ్వాసింగి, కొత్తపల్లి, కులపాడు, వంజరి, గెమ్మెలి తదితర గ్రామాలకువిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

జగన్ అరాచక పాలనను జనం మరచిపోరు

అదో భయాందోళన పాలన

▸▸ సంపూర్ణంగా హామీల అమలు దిశగా అడుగులు

▸▸ ఇది చారిత్రాత్మక దినం: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన వేధింపులు.. అక్రమ కేసులు.. రోజూ అరెస్టులతో ప్రజలు, అధికారులను బెదిరిస్తూ సాగించిన జగన్ అరాచక పరిపాలన గుర్తులను జనం మరిపోలేదన్న విషయాన్ని వైసీపీ నేతలు గుర్తించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలన పూర్తిగా అవినీతి, అక్రమాలు అరెస్టులతో సాగితే, చంద్రబాబు సారథ్యంలో ఏడాది పాలన అందరికీ భరోసా ఇచ్చేలా సాగిందని గుర్తు చేశారు. జగన్ అనాలోచిత, అనుభవరాహిత్య పాలనను భరించలేకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీతో విజయం కట్టబెట్టారన్నారు. అందుకే జనం అధికారం కట్టబెట్టిన రోజుగా జూన్ 4వ తేదీ ఒక చారిత్రక దినంగా నిలిచిపోయిందన్నారు. మూడు రాజధానుల పేరుతో, సాగించిన నాటకాలు, రుషికొండలో జనం సొమ్ము వృథా చేసిన వైనంపై వైసీపీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రీ సర్వే పేరుతో ప్రజల భూములను అస్తవ్యస్తం చేసిన తీరు ఇప్పటికీ సరిదిద్దలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. రోడ్డెక్కితే కేసులు, ప్రశ్నిస్తే అరెస్టులతో జగన్ పాలనలో జనంతో పాటు అధికారులు, ఉద్యోగులు కూడా భయాందోళనతో కాలం వెళ్లదీశారన్నారు. ఇప్పుడు అధికారులు, ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలన కల్పించిందన్నారు. ప్రజలు తమను అధికారం నుంచి ఎందుకు దించేశారో జగన్, వైసీపీ నేతలు విశ్లేషించుకోవాలని కోరారు.

హామీల అమలు దిశగా పాలన...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెట్టింపు పింఛను అందిస్తున్న సంగతి గమనించాలని ఎమ్మెల్యే రాజు అన్నారు. ఏడాదికి మూడు సిలిండర్ల కార్యక్రమం అమలులోకి తెచ్చిందన్నారు. హామీలను సంపూర్ణంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. మూడు నెలల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా బీఎన్ రోడ్డును అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఏం చర్యలు తీసుకుంటామో మరికొద్ది రోజులు వేచి చూడాలని స్పష్టం చేశారు. ధర్మశ్రీ హయాంలో టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడ్డారని, అలాంటి పాలన తాము కొనసాగించలేదన్న విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, టీడీపీ నేత పప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో ఘనంగా పండుగ చేసుకుందాం..

బుచ్చెయ్యపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వడ్డాదిలో పండుగ చేసుకుందాం కార్యక్రమం



వడ్డాది కార్యక్రమంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు, అనంతరం స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. తాత రాజారెడ్డి నుంచి వెన్నుపోటు మొదలైందని, రాజకీయ జన్మనిచ్చిన కాంగ్రెస్ పార్టీని వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితోనే పంచాయతీలకు నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రమేష్, ఎ.నరసింహమూర్తి, డీఎస్.నాగేశ్వరరావు, దొండా సాయి, దొండా నరేశ్, ఎడ్ల రామమూర్తి, జి.మల్లునాయుడు. కె.వెంకట్రావు, దూది రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చి కూటమి నేతల సంబరాలు



నాతవరంలో సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

నాతవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి సుపరిపాలన అందిస్తున్నదన్నారు వైసీపీ నాయకులు జూన్ 4న వెన్నుపోటు దినంగా జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ చెల్లికి, తల్లికి వెన్నుపోటు పొడిచాడన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నందిపల్లి వెంకటరమణ, సూర్యచంద్ర, పి.కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, వి.వెంకటరమణ, పోలుపర్తి శ్రీనువాసు, కుమారస్వామి, పేరూరి బుల్లిదొర, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై అధికారులకు ఫిర్యాదు

రోలుగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోల పునఃప్రారంభోత్సవాలను ఎంతో అట్టహాసంగా నిర్వహించిన నేపథ్యంలో రోలుగుంటలో రేషన్ డిపో-2 డీలరు ప్రొటోకాల్ ఉల్లంఘించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో, తహసీల్దార్‌లకు ఐటీడీపీ గ్రామ కన్వీనర్ బనికెల సురేష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ప్రారంభోత్సవాలల్లో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా, ఈ డిపో నిర్వాహకురాలు కనీసం ప్రొటోకాల్ పాటించలేదన్నారు. ఈ ఉల్లంఘనపై జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని, క్షేత్రస్థాయిలో తగిన విచారణ చేపట్టి ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా తీర్పు దినోత్సవం

నర్సీపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలంతా మూకుమ్మడిగా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన శుభ దినమని, వెన్నుపోటు దినం కాదని తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. బుధవారం నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు దినంగా వైసీపీ నిరసన చేపట్టడానికి ఖండించారు. ఐదేళ్లలో జగన్ పాలన విధ్వంసకరంగా నడవడంతోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకటరమణ, రావాడ నాయుడు, కొరుప్రోలు శ్రీను, కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు కృషితోనే మోదకొండమ్మ జాతర విజయవంతం

▸▸ ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ జాతర విజయవంతానికి ఎమ్మెల్యే కృషే కారణమని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారని, అందుకు అనుగుణంగానే అధికారులు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అమ్మవారి జాతర విజయవంతానికి సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. మోదకొండమ్మ దర్శనానికి వచ్చిన ఎంపీ సీఎం.రమేశ్ ఆలయ అభివృద్ధికి సొంత నిధులు రూ.50 లక్షలు అందిస్తామని ప్రకటించడం ఆనందకరమన్నారు.

మండల స్థాయి అధికారులకు సత్కారం

నాతవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులను అంకంరెడ్డి నూకరాజునాయుడు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం సత్కరించారు. తహసీల్దార్ వేణుగోపాల్, మండల పరిషత్ పరిపాలనాధికారి. పి.పార్థసారథి, మండల విద్యాశాఖాధికారి కె.వరహాలబాబు, విద్యుత్ శాఖ ఏఈ చంద్రమౌళిలను కోటమ్మతల్లి పండుగ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించినందుకుగాను షీల్డు అందజేసి శాలువాలతో సత్కరించారు. తమకు ట్రస్టు సభ్యులు సన్మానం చేయడం మరంత బాధ్యత పెంచిందని తహసీల్దార్ వేణుగోపాల్, ఇతర అధికారులు పేర్కొన్నారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

దేవరాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశామని మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ బుధవారం తెలిపారు. మండలంలో 20 రైతు సేవా కేంద్రాలు ఉండగా ఇప్పటి వరకు 15 కేంద్రాలకు విత్తనాలు చేరాయన్నారు. మిగతా కేంద్రాలకు ఒకటి రెండు రోజులు విత్తనాలు వస్తాయని ఆమె చెప్పారు. ఈ ఏడాది తొమ్మిది వేల ఎకరాల్లో ఖరీఫ్ విస్తీర్ణం కాగా, 450 ఎకరాల్లో వరినాట్లు వేస్తే సరిపోతుందన్నారు. రైతులకు అవసరమైన 11 రకాల విత్తనాలు తెప్పించామని ఏవో తెలిపారు. రాయితీపై ఈ విత్తనాలను త్వరలోనే పంపిణీ చేస్తామని ఆమె చెప్పారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వండి

చీడికాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు మూడేళ్ల వరకు సంరక్షణకు శతశాతం ఖర్చులు అందించనున్నట్టు చెప్పారు. ఈ విషయంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వేతనదారులు ఎక్కువ మంది వచ్చేలా చూడాలని, రూ.307 వేతనం వచ్చేలా పనులు చేయించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏపీవో అల్లు గంగునాయుడు, ఈసీ సతీశ్, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదగోగాడలో కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగ

చీడికాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగోగాడ గ్రామంలో కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగను బుధవారం నిర్వహించనున్నట్టు టీడీపీ సీనియర్ నేత రెడ్డి రాము తెలిపారు. ఉదయం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. సాయంత్రం కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

నాగయ్యపేటలో గండిమారమ్మ జాతర

దేవరాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట గ్రామంలో గురువారం గండిమారమ్మ గ్రామదేవత పెద్ద పండుగ జరగనుంది. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ అలంకరణతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. 25 ఏళ్ల తర్వాత పండుగ జరగడంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు సత్యవరంలో రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాడుగుల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలో గురువారం రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజ స్తంభం, దేవతా మూర్తులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నర్సీపట్నంలో 'వెన్నుపోటు దినం'



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీఎం కాంపౌండ్ నుంచి శ్రీకన్య కూడలి వరకు బుధవారం వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేశ్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఏదొక రూపంలో సంక్షేమ పథకం అందించేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిహెచ్.వరుణ్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చోడవరంలో...



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్మశ్రీ, నేతల అర్ధ నగ్న ప్రదర్శన

చోడవరం, జూన్4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైఫల్యాలకు నిరసనగా బుధవారం పట్టణంలో వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం నిర్వహించారు. స్థానిక కొత్తూరు జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ఊరేగింపుగా వచ్చిన వైసీపీ నాయకులు, తహసీల్దార్ కార్యాలయం వద్ద చొక్కాలు విప్పి ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు గ్రహించారన్నారు. అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులకు నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పరిశీలకుడు జాన్‌వెస్లీ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఏడువాక సత్యారావు, పల్లా నరసింగరావు, పుల్లేటి వెంకటేశ్, నెహ్రూ, దేవరపల్లి సత్య, నాలుగు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగులలో...



డీటీకి వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి బూడి, నాయకులు

మాడుగుల/దేవరాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ ర్యాలీ నిర్వహించింది. బస్టాండ్ ఆవరణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ పలు నినాదాలు చేశారు. అనంతరం డీటీకి లక్షయ్యకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు ఈర్లె అనురాధ, కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వైస్ ఎంపీపీ పాలిమేర విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, పట్టణ అధ్యక్షుడు బి.శ్రీను పాల్గొన్నారు.

అలాగే దేవరాపల్లి నుంచి వైసీపీ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులులు తరలివెళ్లారు.

ప్రధాన రహదారిపై చెత్త తొలగింపు

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రోలుగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెత్తాచెదారాన్ని పంచాయతీ అధికారులు బుధవారం తొలగించి శుభ్రం చేయించారు. 'ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం' అన్న శీర్షికతో ఈ నెల 1వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు రోలుగుంట నుంచి కొమరవోలు వెళ్లే ఊరచెరువు వద్ద రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళ, బుధవారాల్లో అధికారులు తొలగించి పరిశుభ్రం చేశారు. ఇకపై అక్కడ చెత్త వేయడానికి వీల్లేదని వారు ఆదేశాలు జారీ చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి జీలుగులోవ సమస్యలు

▸▸ ఆదివాసీలకు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు హామీ



జీలుగులోవ గ్రామానికి వెళుతున్న హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు

రావికమతం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొండశిఖర గ్రామమైన జీలుగులోవ ఆదివాసీల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు హామీ ఇచ్చారు. పది కుటుంబాలకు చెందిన 30 మంది నివసిస్తున్న జీలుగులోవ గిరిజన గ్రామాన్ని బుధవారం సాయంత్రం ఆయన పార్టీ శ్రేణులతో నాలుగు కిలోమీటర్లు కొండలమీదుగా అడవిలో నడుచుకుంటూ వెళ్లి సందర్శించారు. ఇంత ఎత్తైన కొండపై ఉంటున్న మీరు వివిధ పనుల నిమిత్తం కిందకు వచ్చి వెళ్లాలంటే చాలకష్టమని, కొండ దిగువకు కల్యాణపులోవకు వస్తే అక్కడ పక్కా ఇళ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన చెప్పారు. ఆయన ఆహ్వానాన్ని గిరిజన పెద్దలు సున్నితంగా తిరస్కరించారు. ఇక్కడ అటవీ భూమిని సాగు చేసుకుంటూ బతుకుతున్నామని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామానికి రోడ్డు నిర్మించి ఇక్కడే పక్కా ఇళ్లు నిర్మించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, పొలం పనులకు ఉపాధి హామీ పథకం కింద కూలి చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, బద్రి చిన్నబ్బాయి పాల్గొన్నారు.

మోదకొండమ్మ వైభవం ఎంత చెప్పినా తక్కువే

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి



క్రికెట్ విజేతలకు ట్రోఫీని అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారం మోదకొండమ్మ వైభవం గురించి ఎంత చెప్పినా తక్కువేనని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి పేర్కొన్నారు. అమ్మవారి జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రికెట్ టోర్నీ, చెస్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ప్రచారం చేశానని, అమ్మవారి ఆశీస్సుల వల్ల భారీ మెజారిటీతో గెలుపొందానని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల ఇష్టదేవత మోదకొండమ్మ చరిత్ర విన్న అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ కూడా తన కుటుంబం తరపున ఆలయ అభివృద్ధికి సొంత నిధులు రూ.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అమ్మవారి జాతరను గ్రామస్థులంతా ఐకమత్యంగా చేసుకోవడం అనందదాయకమన్నారు. అమ్మవారి కరుణతో వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే బండారు స్పష్టం చేశారు. అంతకు ముందు నేలవేశాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, తహసీల్దార్ కె.రమాదేవి, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథ శ్రీనివాసరావు, పైడియ్యానాయుడు, జగ్గారావు, దేముడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం.. భీతిల్లిన జనం

చోడవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు తారస్థాయిలో నమోదవుతున్నాయి. వాతావరణ ప్రభావంతో మే నెలంతా అడపాదడపా వర్షాలతో వాతావరణం చల్లగానే ఉన్నప్పటికీ, నాలుగు రోజులుగా ఎండలు తీవ్ర వేసవిని తలపిస్తున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ చుర్రుమంటుండడం, 11 గంటలకు తారస్థాయిలో ఉంటుండడంతో జనం రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. ఎండల ప్రతాపంతో ప్రధాన రహదారిపై జనసంచారం తగ్గిపోయింది. రాత్రి సమయంలో సైతం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుండడంతో వాతావరణం చల్లబడక స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాదేవిపేటలో...





భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా కనిపిస్తున్న కృష్ణాదేవిపేట ప్రధాన రహదారులు

కృష్ణాదేవిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు బుధవారం ఎండతీవ్రతకు నిర్మానుష్యంగా మారాయి. మూడు రోజులుగా అప్పుడప్పుడు అడపాదడపా పడుతున్న వర్షాలతో ఎండలు తగ్గుముఖం పట్టినప్పటికీ, బుధవారం ఎండ తీవ్రతను మరలా యథా స్థితికి చేరింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పగటి ఉష్ణోగ్రత 41 డిగ్రీలు పైబడి ఉన్నాయి. ఎండ తీవ్రతరంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు అల్లాడిపోయారు. నిత్యం రద్దీగా ఉండే కృష్ణాదేవిపేట, చోద్యం ఎండ తీవ్రతతో ప్రజలు, ప్రయాణికులు రాకపోవడంతో నిర్మానుషంగా కనిపించాయి. ఎండలు భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో ప్రజలు ఇళ్లల్లోనే ఉండిపోతున్నారు. కొంత మంది చెట్ల నీడలు సేదదీరుతున్నారు.

సుపరిపాలనకు ఏడాది పూర్తి

▸▸ రామారావుపేటలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల వద్ద నినాదాలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

నర్సీపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామారావుపేటలో బుధవారం జనసేన ఆధ్వర్యంలో సుపరి పాలనకు ఏడాది కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి పంచాడ హరినాథ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి, విజేతలకు బహుమతులు అందించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛను సొమ్ము ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి తీసుకువెళ్లి ఇస్తున్నట్టు చెప్పారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి రూ.5కే పేదలకు అన్నం పెడుతున్నారన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వూడి చక్రవర్తి, మీసాల సత్యనారాయణ, అల్లాడ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెద పద్ధతిలో వరి విత్తుకోవాలి



రామన్నపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ప్రసాదరావు

మాకవరపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెద పద్ధతిలో వరిని విత్తుకుంటే సాగు ఖర్చు తగ్గుతుందని బీసీటీ కృషి విజ్ఞాన శాస్త్రవేత్త వి.ప్రసాదరావు చెప్పారు. మండలంలోని రామన్నపాలెం, చింతలూరు గ్రామాల్లో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు భూమి ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. అలాగే వెద వరి సాగు వల్ల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. అలాగే డ్రోన్ ద్వారా పిచికారీ, డ్రోన్ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిరంజీవి, ఏఈవో శేషునాయుడు పాల్గొన్నారు.

కబళిస్తున్న ప్లాస్టిక్



విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం

- అటకెక్కిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ప్లాస్టిక్ పేపర్ల వాడకం
- వేడివేడి కూరలు, టీ, కాఫీలు పాలిథిన్ కవర్లలో ప్యాకింగ్
- కర్రీ పాయింట్లు వద్ద ప్లాస్టిక్ కవర్లలో కూరలు, సాంబారు విక్రయాలు
- వీటిని ఆహారంగా తీసుకుంటే శరీరంలోకి ప్లాస్టిక్ అవశేషాలు
- క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత ప్రాణాంతక వ్యాధులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నర్సీపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అడ్డూ అదుపు లేకుండా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కారణంగా నేల, నీరు, గాలి కలుషితం అవుతున్నాయి. చివరకు మనిషి శరీర అవయవాలు, రక్తంలో కూడా ప్లాస్టిక్ అవశేషాలు ఉంటున్నాయి. ఈ ప్రమాదాన్ని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం 2022 జూన్ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించింది. కానీ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీగా అమలు చేయడంలేదు. దీంతో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగి పోతున్నది. నర్సీపట్నం వంటి గ్రేడ్-3 మునిసిపాలిటీలోనే రోజూ 300 నుంచి 400 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉద్భవిస్తున్నాయి. కూరగాయల మార్కెట్లు, కిరాణా



ప్లాస్టిక్ కప్పుల్లో టీ



పేపర్ ప్లాస్టిక్ ప్లేట్లు

షాపులు, మాంసం/ చేపల దుకాణాల్లో తక్కువ మందంగల నాసిరకం పాలిథిన్ కవర్ల వినియోగం అధికంగా ఉన్నది. హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు తిండ్లు విక్రయించే షాపుల నిర్వాహకులు పార్శిళ్ల కోసం ప్లాస్టిక్ పేపర్‌ని వాడుతున్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు, టీ, కాఫీ వంటివి కూడా పల్చటి పాలిథిన్ కవర్లలో ప్యాకింగ్ చేసి ఇస్తున్నారు. కర్రీ పాయింట్ల నిర్వాహకులు వేడి కూరలను పాలిథిన్ కవర్లో పోసి పార్శిల్ చేస్తున్నారు. వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్‌లో వేయడం వల్ల మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలు ఆహారంతో కలిసి, వాటిని తిన్న వారి రక్తంలో ప్లాస్టిక్ అవశేషాలు చేరుతున్నాయి. దీనివల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను అన్నిచోట్లా బహిరంగంగానే వినియోగిస్తున్నప్పటికీ నియంత్రణ శాఖల అధికారులు కనీస చర్యలు చేపట్టడంలేదు.

అమలుకాని సింగిల్ యూజ్ ప్లాసిక్ నిషేధం

పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి హానికరమైన ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం కోసం కేంద్ర ప్రభుత్వం 2022 జూలై ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించింది. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిల్స్, కవర్లు, స్ట్రాలు వంటి 16 రకాల వస్తువులను ఈ జాబితాలో చేర్చింది. కానీ ఈ ఆదేశాలు ఎక్కడా అమలు కావడంలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్లకంటే ఎక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలి. ప్రస్తుతం మార్కెట్లో చలామణి వున్న కవర్లు 10 మైక్రాన్ల మందం కూడా వుండడంలేదు.



పాలిథిన్ కవర్లలో కూరలు

స్పీకర్ ఆదేశించినా..

నర్సీపట్నం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ ఏడాది మార్చి 15వ తేదీన జరిగిన స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కోసం పర్యావరణహిత స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ రహిత వస్తువులు ప్రదర్శించారు. వస్త్రం, నారతో చేసిన సంచులు వినియోగాన్ని పోత్సహించాలని, ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే షాపులను సీజ్ చేయాలని హెచ్చరించారు. కానీ ఇంతవరకు స్పీకర్ ఆదేశాలు అమలుకి నోచుకోలేదు.

కుటీర పరిశ్రమగా ప్లాస్టిక్ వస్తువుల తయారీ

ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల తయారీ కుటీర పరిశ్రమలా మారిపోయింది. అడుగున అట్ట, పైన పల్చటి ప్లాస్టిక్ కవర్‌తో లామినేట్ చేసి ప్లేట్లు తయారు చేస్తున్నారు. శుభ/అశుభ కార్యాయాల్లో అల్పాహారం, భోజనాలు చేయడానికి ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు వాడుతున్నారు. ప్లాస్టిక్ కవర్‌తో లామినేట్ చేసిన ప్లేట్లలో వేడి ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఇటువంటి ప్లేట్లలో ఆహారాన్ని భుజించే వారి శరీరం, రక్తంలోకి ప్లాస్టిక్ అవశేషాలు చేరుతున్నాయి. మరోవైపు కార్యక్రమం తర్వాత ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ ప్లేట్లు స్థానంలో ప్రత్యామ్నాయ ప్లేట్లు అందుబాటులో ఉన్నప్పటికీ ప్లాస్టిక్ ప్లేట్లు తక్కువ ధరకు లభ్యమవుతున్నాయని అధికంగా వినియోగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి



కలగ దుర్గినాయుడు (ఫైల్ ఫొటో)

కశింకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గినపాలెం జాతీయ రహదారి దాటుతున్న తాపీ మేస్త్రిని లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన కలగ దుర్గినాయుడు(45) తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. పని ముగించుకొని రోజూ మాదిరిగానే బుధవారం రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



పార్వతమ్మ మృతదేహం

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటనపై ఆమె కుమారుడు శ్రీనివాసరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ హెడ్ కానిస్టేబుల్ బోకం రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల గ్రామానికి చెందిన మళ్ల పార్వతమ్మ (62) గత నెల 27వ తేదీన మేడ పైకి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడిపోయింది. వెంటనే ఆమెను కోడలు వాణి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం విశాఖ నగర పరిధిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతి చెందినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నాటు సారా కేసులో నిందితుడిపై పీడీ యాక్ట్

పాయకరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పలు నాటుసారా కేసుల్లో నిందితుడిగా ఉన్న పాయకరావుపేట మండలానికి చెందిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన యాండ్ర సత్తిబాబు(32) పలుమార్లు నాటు సారా కేసుల్లో నిందితుడిగా పట్టుబడ్డాడని, దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తు నిర్బంధ చట్టం ప్రకారం పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. నిందితుడిని బుధవారం పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ జి.శ్రీనివాస్ అదుపులోకి తీసుకుని జిల్లా జైలుకి తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

- రూ.25 వేల నగదు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం
- నిందితులను పట్టిచ్చిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలి గ్రామానికి వెళ్లే దారిలో సుమారు మూడు నెలల క్రితం జరిగిన దోపిడీ కేసును ఎలమంచిలి పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.25 వేల నగదు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎలమంచిలి సర్కిల్ కార్యాలయంలో సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 12న మండలంలోని కొత్తలి గ్రామానికి చెందిన ఇత్తంశెట్టి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు అతనిని అడ్డగించి బెదిరించారు. అతని సెల్‌ఫోన్ నుంచి రూ.25 వేలు ఫోన్ పే చేయించుకుని సెల్‌ఫోన్‌ను కూడా తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై ప్రసాద్ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలమంచిలి సీఐ, రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఇటీవల నిందితులు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బాధితుడి సెల్‌ఫోన్ నుంచి రూ.25 వేలు ఫోన్ పే చేయగా పోలీసులు ఆధారాలు సేకరించారు. బుధవారం ఎలమంచిలి సమీపంలోని కొక్కిరాపల్లి వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులు ఎలమంచిలి మండలం పులపర్తి గ్రామానికి చెందిన తప్పెట్ల భగవాన్, ఎస్.రాయవరం మండలం వేమగిరి గ్రామానికి చెందిన కొప్పన రవిగా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి బైక్, రూ.25 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ స్నేహితులని, వీరిలో కొప్పన రవి హైదరాబాద్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేసేవాడని సీఐ తెలిపారు. పండుగ సందర్భంగా ఇద్దరూ కలిశారని, మద్యం సేవించి ఈ దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. వీరిద్దరికీ ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు ఉందన్నారు. ఈ కేసు ఛేదించడంలో తనకు సహకరించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

80 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ ఎం.శ్రావణి

కొత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రోలుగుంట పోలీసు స్టేషన్ పరిధిలో 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశామని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3న పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో గంజాయి నిల్వలు ఉన్న స్థలంపై దాడి చేశారన్నారు. దీంతో కొవ్వూరు నుంచి కొంతలం గ్రామాల మధ్య ఉన్న జీడితోటలో దాచినట్టు తెలిసిందన్నారు. వెంటనే పోలీసు బృందంతో దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడడంతో వారిని పూర్తిగా విచారించగా గంజాయి సంచులు దాచిన ప్రదేశాలను చూపించారన్నారు. మొదట 60 కిలోల గంజాయి జీడితోటలోను, మరో 20 కిలోల గంజాయి బైక్‌పై తీసుకువచ్చి దాస్తున్న సమయంలో పట్టుకున్నామన్నారు. ఈ కేసులో నర్సీపట్నానికి చెందిన కుంచా యేసు, రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎర్ర వపన్‌కుమార్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం శిరిపురం గ్రామానికి చెందిన బూరిటి శ్రీను వద్ద 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్టు తెలిసిందన్నారు. గతంలో కుంచా యేసుపై నర్సీపట్నం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒక దోపిడీ కేసు ఉందని చెప్పారు. వీరి నుంచి బైక్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసును సకాలంలో ఛేదించిన ఎస్ఐ రామకృష్ణను, రైడ్ బృందాన్ని ఆమె అభినందించి బహుమతితో సత్కరించారు.

వరహా నదిలో మునిగి అన్నదమ్ముల మృతి

... 5వ పేజీ తరువాయి

నీటిలో మునుగుతూ తేలుతూ పెద్దగా కేకలు వేశారు. ఈ సమయంలో అటుగా వెళుతున్న మహిళా రైతు ఒకరు చూసి, బిగ్గరగా కేకలు వేయడంతో పలువురు గ్రామస్థులు పరుగులు తీసుకుంటూ నది వద్దకు వచ్చారు. నాయుడు, మోహన్‌లను బయటకు తీశారు. తీవ్రఅస్వస్థతకు మోహన్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. దేవా, హేమంత్ కోసం నదిలో గాలించి.. సుమారు అర్ధ గంట తరువాత మృతదేహాలకు బయటకు తీశారు. ఈ సంఘటన జరిగిన సమయంలో వీరి తల్లిదండ్రులు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. కుమారులు ఇద్దరూ నదిలో మునిగి మృతిచెందిన విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. విగతజీవులుగా మారిన బిడ్డలను చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. వచ్చే వారం స్కూళ్లు తెరిచిన తరువాత దేవా పదో తరగతిలోకి, హేమంత్ ఎనిమిదో తరగతిలోకి వెళ్లనున్నారు. మృతుల తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబానికి అప్పగించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతిచెందడంతో జానకిరాంపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గార్మెంట్ పరిశ్రమల హబ్‌గా అనకాపల్లి

- చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

అనకాపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో గార్మెంట్స్ ఇండస్ట్రీస్ హబ్‌గా అనకాపల్లి జిల్లా మారనుందని, అందుకు ఎన్డీయే ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. బుధవారం గౌరీ గ్రంథాలయంలో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీషు, పని ప్రదేశ ప్రవర్తనలపై శిక్షణ పొందిన వారికి ఆయనతో పాటు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నూతన పారిశ్రామిక విధానం వల్ల 2025-26లో మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగనుందన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు, వ్యాపార ప్రణాళికలు, డిజిటల్ మార్కెటింగ్‌లపై సహకార సంఘాలు, రిటైర్డు సైనికులు, మహిళా సంఘాలతో కలిసి ఎంఎస్ఎంఈ ప్రత్యేక శిక్షణ ఇస్తుందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో పర్యావరణ అనుకూల సాంకేతికతను ప్రోత్సహిస్తుందన్నారు. ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు కూడా పెంచుతుందన్నారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు జీవీఎంసీ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సీహెచ్ అప్పలనాయుడు, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, అనుదీప్ ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ బిశ్వాస్, క్లస్టర్ మేనేజర్ ఏ. నాగేంద్ర, గ్రంథాలయ ప్రతినిధులు, బోధకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



హాజరైన రెవెన్యూ అధికారులు తహసీల్దార్లు

అనకాపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయాలకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందుతున్న అర్జీలపై క్షేత్ర స్థాయిలో సమగ్రంగా విచారణ జరిపి, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం డివిజన్, మండల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలు, మ్యుటేషన్లు, రేషన్ పంపిణీపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏపీ సేవా సర్వీసులు సక్రమంగా అందేలా చూడాలని, నీటితీరువా వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీకి నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపే బాధ్యత తహసీల్దార్లు తీసుకోవాలన్నారు. బాణసంచా తయారీ యూనిట్ల ఏర్పాటు కోసం అందిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అనుమతులు జారీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీఓలు షేక్ ఆయీషా (అనకాపల్లి), వి.వి.రమణ (నర్సీపట్నం), డీఎస్ఓ కేవీఎల్ఎన్ మూర్తి, మండలా తహసీలార్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

- అనకాపల్లి వాసికి ప్రథమ బహుమతి



రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఆర్.సన్యాసిరావు

ఎలమంచిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర స్థాయి పాటల పోటీలను గురవప్ప కల్యాణ మండపంలో నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మత్స్యర్తి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 72 మంది గాయనీ, గాయకులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రథమ బహుమతి అనకాపల్లికి చెందిన ఆర్.సన్యాసిరావు, ద్వితీయ బహుమతి హైదరాబాద్‌కు చెందిన కె.దుర్గా ప్రసాద్, తృతీయ బహుమతి తణుకుకు చెందిన ఎ.రాజు, కన్సొలేషన్ బహుమతి ఎలమంచిలికి చెందిన సీడీవీ తేజస్విని గెలుపొందారు.

'మంత్రి అనిత బాధ్యతను విస్మరించారు'

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు యువకులను పోలీసులు బహిరంగంగా దండించడాన్ని తప్పుబట్టాల్సిన హోం శాఖ మంత్రి అనిత.. ఆ బాధ్యతను విస్మరించి పోలీసులకు మద్దతుగా మాట్లాడడం తగదని మానవ హక్కుల ఫోరం బుధవారం ఒక ప్రకటనలో ఆక్షేపించింది. తెనాలి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంది. తప్పు చేసిన వారికి కులం, మతం ఉండవని మంత్రి పేర్కొన్నారని, దీని ద్వారా ఆమె కుల గుర్తింపును తేసిపుచ్చినట్టయిందని ఫోరం ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ అనిత మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దొడ్డిదారిన ఆశీలు వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

సంవత్సరం (2024-25) సంత ఆశీలు వేలం పాటను మోసయ్యపేటకు చెందిన ఒక వ్యక్తి రూ.7.2 లక్షలకు పాడుకున్నారు. ఈ ఏడాది మార్చితో గడువు ముగిసింది. పంచాయతీ అధికారులు వేలం పాట కోసం అంతకు ముందే పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ రాజకీయ కారణాలతో ఆశీలు వేలం పాట నిర్వహించలేదు.

ఇదిలావుండగా గత ఏడాది ఆశీలు వేలంపాట పాడుకున్న వ్యక్తి పంచాయతీ సర్పంచ్‌కు దగ్గర బంధువు. వేలం పాటకు సంబంధించి పంచాయతీకి రూ.7.2 లక్షలు చెల్లించాల్సి వుండగా, రూ.5.2 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.2 లక్షలు బకాయి ఉన్నారు. 2025-26 ఆశీలు వసూలుకు వేలం పాట నిర్వహించని అధికారులు... ఏప్రిల్ నుంచి ఆశీలు వసూలు బాధ్యతను పాత కాంట్రాక్టర్‌కే అప్పగించారు. ఒక రోజుకు రూ.8-10 వేల వరకు ఆశీలు వసూలవుతుంది. ఈ లెక్కన నెలకు లక్ష రూపాయలకుపైగా ఆదాయం వస్తుంది. కానీ ప్రస్తుత అనధికారిక కాంట్రాక్టర్ అంత మొత్తం పంచాయతీకి జమ చేయడంలేదని కొంతమంది వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు, సర్పంచ్ కుమ్మక్కై సంత ఆశీల వేలం పాట నిర్వహించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సర్పంచ్ పంచదార్ల పైడిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అనివార్య కారణాల వల్ల ఆశీలు వేలం పాట నిర్వహించలేకపోయామని అన్నారు. ఆశీలు వసూలుకు పంచాయతీలో సరిపడ సిబ్బంది లేనందున పాత కాంట్రాక్టర్‌కే ఆ బాధ్యత అప్పగించినట్టు చెప్పారు. ఏప్రిల్‌లో అతను వసూలు చేసిన ఆశీలు రుసుము మొత్తం రూ.49,500లను మే నెల 3వ తేదీన పంచాయతీ ఖాతాకు జమచేశారని తెలిపారు. మే నెల ఆశీలు ఆదాయం ఇంకా పంచాయతీ ఖాతాకు జమ చేయలేదన్నారు.

కొత్తపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరవాడ ఈఓపీఆర్డీ విచారణ జరిపారు. కల్యాణ మండపం అద్దెల రూపంలో 2019 ఫిబ్రవరి నుంచి 2024 అక్టోబరు వరకు రూ.69,33,255 ఆదాయం వచ్చిందని, ఇందులో రూ.21,97,689లను ఖజానాకు జమ చేయకుండా సర్పంచ్, కార్యదర్శి కుమ్మక్కై దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏప్రిల్ 26న కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీనిపై వివరణ కోరుతూ గత నెల ఆరో తేదీన వరలక్ష్మికి జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఇరవై రోజుల తరువాత ఆమె వివరణ పంపారు. వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు చెక్ పవర్‌ని 90 రోజుల పాటు రద్దు చేస్తూ గత నెల 28న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా కార్యదర్శి వరలక్ష్మిని సస్పెండ్ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539